## క్లుప్తంగా

### నేడు జగనన్న సురక్ష కార్యక్రమాలు ఇలా..

శావల్యాపురం:మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయం పరిధిలో నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య మంగళవారం తెలిపారు. సచివాలయ పరిధిలో 1200 నివాస గృహాలు ఉండగా ఇప్పటి వరకు 850 గృహాలను వలంటీర్లు సర్వే చేసినట్లు చెప్పారు. ఇందుకుగాను 900 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయటానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

**సొలసలో....**

యడ్లపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని సొలస గ్రామంలో బుధవారం గ్రామంలోని సచివాలయం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. ఈ సదస్సులో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని 11 రకాల ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తారు.

**నేడు ఎండుగుంపాలెంలో..**

నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ అల్లడి రవికుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, నాయకులు, మండలస్థాయి అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

### ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

శావల్యాపురం: మండల కేంద్రంలో రైల్వే స్టేషను రహదారి మార్గంలో మరలా జరుగుతున్న రోడ్డు ఆక్రమణలపై రెవెన్యూ, పంచాయతీ అధికారుల సారథ్యంలో చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ కంచెటి నవ్య అన్నారు. మంగళవారం రైల్వే స్టేషను పరిధిలో రహదారి మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గతంలో మార్కింగ్ చేసిన ప్రకారం సైడు కాల్వ దాటి వ్యాపార సంస్థలు దుకాణాదారులు ముందుకు రాకూడదన్నారు. అవిధంగా వచ్చిన వారిపై రెండు వ్యవధిలోపు సమయం ఇచ్చామని లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ వారి సారథ్యంలో రహదారి మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారుల ద్వారా స్తంభాలను తొలగిస్తామన్నారు.

### నిద్రమత్తు.. కల్వర్టుని ఢీకొట్టించింది!

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన జాతీయ రహదారి మార్గంలో మినీలారీ అదుపు తప్పి వంతెన ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండ నుంచి నరసరావుపేట వైపు ఖాళీ లారీ వస్తుండగా మార్గమధ్యంలో లారీ డ్రైవరు నిద్రమత్తులో అతివేగంతో పెదకంచర్ల కాల్వ వంతెన ఢీకొంది. దీంతో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న మినీ లారీను పొక్లయినర్ ద్వారా పక్కకు తొలిగించి ట్రాఫిక్ సరిచేశారు. డ్రైవరుకు స్వల్ప గాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి లారీను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### 20న గణపవరంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో గురువారం ఉదయం 9 గంటలకు దివీస్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి (పాస్/ఫెయిల్) బీఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, బీటెక్ (మెకానికల్, కెమికల్) ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలటికల్ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ) ఎంఫార్మసీలో (ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ) పూర్తయినా లేక ఆఖరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్ల ఒరిజినల్ జిరాక్స్ కాపీలు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్, ఉచిత వసతి, యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ కల్పిస్తారని తెలిపారు. వివరాలకు 9030616331, 9441898540 నంబర్ల నందు సంప్రదించాలని కోరారు.

### సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు

చిలకలూరిపేట: సామాన్యుల ఇబ్బందులు తెలిసిన ప్రభుత్వం తమదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. పట్టణంలోని రైతు బజారులో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కౌంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీపై బియ్యం, కందిపప్పు అందజేస్తున్నదని చెప్పారు. మేలు రకం సన్నబియ్యం కేజీ రూ. 46, మరో రకం కేజీ రూ.49 చొప్పున విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికీ ఐదు కేజీల నుంచి 25 కేజీల వరకు బియ్యం విక్రయిస్తామన్నారు. అదే కందిపప్పును కేజీ రూ.135 చొప్పున రెండు కేజీల వరకు విక్రయిస్తారని తెలిపారు. ఇప్పటికే కేజీ టమాటా రూ. 50లకే సబ్సిడీ ధరపై విక్రయిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, శ్రీలక్ష్మి, మీరాబి, కోట్యానాయక్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్ జి.సుజాత, సీఎస్‌డీటీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- 16వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం



నరసరావుపేటలో ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు దేశంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డు శ్రీరామపురంలోని దేవీ కాన్ఫరెన్స్ హాలులో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షతన 'జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ నేరుగా మిమ్మల్ని కలుసుకొని, సమస్యలతో పాటు సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు అధికారులతో కలిసి మీ వద్దకు వచ్చామన్నారు. ఏ సమస్య ఉన్న తనతో చెప్పాలని కోరారు. ఈ వార్డులో ఇప్పటి వరకు రూ.2.89 కోట్లను సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందజేశామని, మరో రూ.2.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, కల్వర్టులు, తాగునీటి పైపులైను ఏర్పాటు చేశామన్నారు. 62 మందికి ఇళ్ల పట్టాలు, మరో 72 మందికి టిడ్కో గృహాలు అందజేశామన్నారు. పింఛన్లు 177 మందికి, 349 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశామన్నారు. అమ్మఒడి 205 మందికి, జగనన్న విద్యాదీవెన 138 మంది, వసతి దీవెన మరో 138 మందికి అందుతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండానే నేరుగా ప్రభుత్వ పథకాల నగదు తమ ఖాతాల్లోకే జమ అవుతున్నందుకు మహిళలు ప్రభుత్వ పాలనపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పార్టీ, మతం, కులం, చూడకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ప్రతి కుటుంబానికి ఈ నాలుగేళ్లలో రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి కలిగిందన్నారు. ఈ సంక్షేమ పథకాలు ఆగకుండా మరింత మెరుగ్గా అమలు జరగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని సూచించారు. తమ ప్రభుత్వం ప్రజల అభిమానాన్ని పొందిందని, అదిచూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయని ఎద్దేవా చేశారు. వారందరూ ఏకమై ఓడించాలని చూసినా ప్రజలంతా ఏకతాటిపై మళ్లీ సీఎంగా జగన్‌ని అధికార పీఠంపై కూర్చోబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆదాయ, కుల, జనన మరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పోడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ముదిరాజు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్ డి.శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, నాయకులు వి.సాంబశివరావు, నిడమానూరి సురేంద్ర, కొత్తమాసు మల్లారావు పాల్గొన్నారు.

**అర్హులందరికీ న్యాయం చేసేందుకే..**

చిలకలూరిపేట: ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 12, 33 వార్డులకు సంబంధించి సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంతకు ముందు ఏ ప్రభుత్వం కూడా చేపట్టని గొప్ప కార్యక్రమమని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాల పరంగా ఇంకా ఎవరైనా అందని వారుంటే వారికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందించి అర్హులను చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం, భూహక్కు పత్రాలు, పంటసాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు, లేదా రేషన్ కార్డు విభజన, కుటుంబ వివరాల్లో మార్పులు ఇలా 11 రకాల ధ్రువ పత్రాలను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా అందించే మహత్తర కార్యక్రమం అని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం పారదర్శకంగా అమలు చేసిన ఘనత ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందేలా చూడడం, సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి వారికి త్వరితగతిన పథకాలు అందేలా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. చిట్టచివరి లబ్ధిదారుడికి కూడా న్యాయం చేకూర్చాలనే గొప్ప ఆశయంతో సీఎం జగనన్న ఈ బృహత్తర కార్యక్రమానికి నాంది పలికారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు యడ్ల ఇందిర, కొచ్చెర్ల విజయలక్ష్మి, బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకట రమణ, నాయకులు యడ్ల సురేష్, కొచ్చెర్ల కిషోర్, బండారు దాసు పాల్గొన్నారు.

**జగనన్న సురక్షలో ఉచిత సేవలు**

బొల్లాపల్లి: జగనన్న సురక్ష పథకంలో ఉచిత సేవలు ద్వారా కావల్సిన ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు, గుట్లపల్లి సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల పరిధిలో ఉచిత సేవలు ద్వారా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గుమ్మనంపాడు 745, గుట్లపల్లి 373 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచిత సేవలు ద్వారా అందజేశారు. వీటిలో ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, జనన, మరణ, కుల, ఆదాయ, వివాహ ధ్రువీకరణ పత్రాలు తదితర 11 రకాల సేవలను జగనన్న సురక్షలో లబ్ధిదారులకు ఉచిత సేవలు ద్వారా అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా వీటితో పాటు సంక్షేమ పథకాలు అరకొరగా ఎవరైనా పొందని లబ్ధిదారులు ఉంటే వారిని గుర్తించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందజేస్తామని తెలిపారు. జగనన్న సురక్షలో విశేష ఆదరణ లభించిందని తెలిపారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి తమ సేవలు ద్వారా అర్హత కలిగిన వారిని గుర్తించి వారికి కావల్సిన ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలో నమోదు చేసిన అనంతరం వీరికి సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాల జారీ చేశామని తెలిపారు. సర్పంచ్ కటారి పున్నమ్మ, వై.కీర్తి, బి.రాములు బాయి, ఎంపీటీసీలు వి.వెంకట రెడ్డి, ఎం.వెంకట రమణ, తహసీల్దార్ ఎ.వి. సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, డీటీ వి.సుధాకర శర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. శ్రీదేవి, ఏపీఓ ఎస్.ఆంజనేయ రాజు, పార్టీ నాయకులు కృష్ణా నాయక్, ఎ.సాంబిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గుమ్మనంపాడులో ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న లబ్ధిదారులు



వడ్లమూడివారిపాలెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ అంకారావు



చిలకలూరిపేటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

**రొంపిచర్లలో...**

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం, వి.రెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లమూడివారిపాలెం గ్రామంలో 80 సర్టిఫికెట్లను జారీ చేశారు. అలాగే వి.రెడ్డిపాలెం గ్రామంలో 60 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్బంగా ఎండీవో మాధ్యూబాబు, తహసీల్దార్ అంకారావు మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లను ఎలాంటి రుసుము లేకుండా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులందరికీ గ్రామ సభల ద్వారా అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గానుగపంట ఉత్తమ్‌రెడ్డి, బత్తుల నాగమ్మ, కొరెడ్డి వెంకట కోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పూర్ణమ్మ, వీఆర్వోలు సుబ్బారెడ్డి, సురేష్, పంచాయతీ కార్యదర్శులు నరిసిరెడ్డి, ఎన్.కోటిరెడ్డి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వినుకొండలో....**

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కట్టకింద బజారు, ఓబయ్య కాలనీ సచివాలయాల పరిధిలో, వినుకొండ రూరల్ పరిధిలోని గోకనకొండ గ్రామసచివాలయంలో మంగళవారం సభలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ హయాంలోనే సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): గతంలో ఎన్నడూ లేనివిధంగా గడపగడపకు తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని లాయర్స్‌స్ట్రీట్-2 సచివాలయం పరిధిలోని 18వ వార్డు, ఓబయ్య కాలనీ సచివాలయ పరిధిలోని 25వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలు తాగునీటి సమస్యను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు ట్యాంకర్ల పేరుతో దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం వినుకొండలో బిందెల సంస్కృతిని రూపుమాపామని, రానున్న రోజుల్లో 24 గంటలు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్ రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఎవరు ఎన్ని విధాలా అడ్డుపడినా వినుకొండ అభివృద్ధిని ఆపలేరని, వినుకొండ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణం.. కమనీయం...



గణపవరంలో రాముల వారి కల్యాణం నిర్వహిస్తున్న శ్రీనివాస దీక్షితులు



వినుకొండలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

- గణపవరంలో కోదండరామునికి...
- వినుకొండలో సంతాన వేణుగోపాల స్వామికి..

నాదెండ్ల: గణపవరంలోని శ్రీ కోదండరామస్వామి కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం కన్నుల పండువగా జరిగింది. రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయాన్ని జూన్ 7న త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా ప్రతిష్ట జరిగిన విషయం విదితమే. ఆలయ ప్రతిష్ట జరిగి 41 రోజులైన సందర్భంగా సోమవారం మండల దీక్షా మహోత్సవం నిర్వహించారు. టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం శాంతిహోమం, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ 140 జంటల చేతుల మీదుగా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రాముల వారి పట్టాభిషేకం జరిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం**

రామాలయ కమిటీ 24 మంది సభ్యులతో ఏర్పాటైంది. త్వరలో కమిటీ రిజిస్ట్రేషన్ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. 24 మంది కమిటీ సభ్యులతో ఆలయంలో మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, చినజీయర్ స్వామి శిష్యులైన కూర్మనాథ స్వామి, భారతీయ ధార్మిక పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణలు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేశారు. సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, కేతినేని శ్రీహరి రావు, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు పాల్గొన్నారు.

**రుక్మిణీ, సత్యభామలతో సంతాన వేణుగోపాల స్వామికి..**

వినుకొండ టౌన్: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ప్రతిష్ఠ జరిగి 41వ రోజు అయిన సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి నుంచి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించగా, 15 మంది దంపతులచే ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో భాగంగా కనపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్న సంతర్పణ జరిగింది.

### ఆదర్శమైన జీవనాన్ని పొందాలి

వినుకొండ టౌన్: సమాజ హితాన్ని చేకూర్చే విధంగా యువత ఆదర్శ వంతమైన జీవనాన్ని పొందాలని పట్టణ సిఐ ఎస్. సాంబశివరావు పేర్కొన్నారు. పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో గల షిరిడీ సాయిబాబా కల్యాణ మండపంలో స్థానిక విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులకు మానవ జీవన విధానం, విద్యార్థి జీవన లక్ష్యాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర స్వామితోపాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సంస్కార వంతమైన విద్యను అభ్యసించి, ఆదర్శమైన జీవనాన్ని కొనసాగించాలని సూచించారు. ఆదేవిధంగా విద్యార్థులు తోటి విద్యార్థులతో మెలగవలసిన విధానాన్ని, సమాజ హితాన్ని చేకూర్చే విధంగా ఆదర్శ వంతమైన జీవితాన్ని పొందాలన్నారు. గాలి శ్రీనివాసరావు, భాగవతుల రవికుమార్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపల్ శ్రీవల్లి పావని, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### కందిపంట విస్తీర్ణం పెంచాలి

చిలకలూరిపేటటౌన్: కందిపంటలను ఇతర పంటల్లో అంతరపంటగా సాగుచేయాలని జిల్లా మానవవనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి చెప్పారు. మంగళవారం మండలంలోని లింగంగుంట్ల గ్రామం రైతు భరోసా కేంద్రం వద్ద సిబ్బందికి కంది సాగు, చిరుధాన్యాల వ్యాప్తి పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు కందివిత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, చిలకలూరిపేట ఏవో శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ఎన్‌జీవోల తోడ్పాటు అవసరం

- ఎంపీ లావు, కలెక్టర్ శివశంకర్
- బొల్లాపల్లి, మాచవరం మండలాల్లో విద్యావలంటీర్ల ఏర్పాటు
- ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేత
- పాల్గొన్న పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరి, జేసీ శ్యామ్‌ప్రసాదు



కలెక్టరేట్‌లో వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీ లావు, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: విద్యాప్రగతికి అసిస్ట్ సంస్థ లాంటి వారి సేవలు ఎంతో అవసరమని పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో మంగళవారం అసిస్ట్ సంస్థ ద్వారా బొల్లాపల్లి, మాచవరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు 32 మంది విద్యావలంటీర్లను నియమించిన సందర్భంగా వారికి విద్యావిధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన వారు మెరుగైన విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు మాట్లాడుతూ వలంటీర్లు చేపట్టాల్సిన విధులు, పిల్లల్లో తీసుకు రావల్సిన మార్పులను వివరించారు. అసిస్ట్ సంస్థ అందిస్తున్న సహాయ, సహకారాన్ని వినియోగించుకుని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన విద్యాభివృద్ధి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈసందర్భంగా నియమితులైన వలంటీర్లకు నియామక పత్రాలను అందజేశారు. పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరి శంకరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్, అసిస్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ

శావల్యాపురం: స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసినీ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళ సంఘాలు రుణాలు చెల్లింపులు ఆర్థిక ప్రగతిపై గ్రామసమాఖ్య సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా స్త్రీనిధి డీఆర్‌యం రంతు చిన్న బుల్లెయ్య పాల్గొని మాట్లాడుతూ శావల్యాపురం మండలానికి స్త్రీనిధి రుణాలు రూ.5 కోట్లు కేటాయించామని 1000 మంది మహిళా సభ్యులకు రుణాలు పారదర్శకంగా మంజూరు చేయడానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామన్నారు. ఇక నుంచి ఆటో డిబెట్ విధానంలో బ్యాంకు పొదుపు ఖాతాల ద్వారా రుణాలు చెల్లింపు జరిగేలా అవకతవకలకు ఫిర్యాదులకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఏపీయం జి.వాసుబాబు, స్త్రీనిధి మేనేజరు జి.వెంకట రాకేష్, సీసీలు గొట్టం రమాదేవి, బేబి రాణి, ఖాజావలీ వీఓఏలు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్లో సౌకర్యాల పరిశీలన

నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట రైల్వేస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యాల తీరును దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల సంప్రదింపుల కమిటీ సభ్యులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మంగళవారం పరిశీలించారు. బుకింగ్ కౌంటర్ వద్ద ఏటీఎం టికెట్ మిషన్ పని చేయకపోవడం, స్టేషన్ల మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్ల రాకపోకల వివరాలను స్టేషన్ మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్లో రూ.15 రూపాయలకే వాటర్ బాటిల్ విక్రయించేలా రైల్వే శాఖ అన్నీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్టాల్స్‌లో రూ.20లు విక్రయించడం సరికాదన్నారు. రైల్వే ప్రయాణీకుల ఫిర్యాదుల మేరకు స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల రవాణాపై అదనంగా రూ.150 నుంచి రూ.200లు రుసుము వసూలు చేయటంపై రైల్వే కమర్షియల్ విభాగ ఉద్యోగులను ప్రశ్నించారు. ఈసందర్భంగా వరప్రసాదు మాట్లాడుతూ నరసరావుపేట-వినుకొండ మధ్య రెండవ రైల్వేలైను పనులు జరుగుతున్న నేపథ్యంలో కొద్ది నెలల తరువాత గతంలో వలె ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించి గుంటూరు నుంచి మార్కాపురం-దొనకొండ వరకు ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. చిత్రాలయ సెంటర్లో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే జీఎం దృష్టికి తీసుకు వెళతామన్నారు. రైల్వేస్టేషన్ పరిసరాలు పరిశుభ్రతపై మేనేజర్‌ను అభినందించారు. సౌత్ కోస్టల్ రైల్వే ప్రయాణీకుల సంఘ ప్రతినిధులు వెంకటేష్, సయ్యద్ ఖాజా, మనోజ్ కుమార్, రామకృష్ణ, ఎస్. వెంకట శాంతి పాల్గొన్నారు.

### అటవీ సంపదను పరిరక్షించాలి

బొల్లాపల్లి: అటవీ సంపదను పరిరక్షించాలని రాష్ట్ర విజిలెన్స్-2 జిల్లా అటవీ శాఖాధికారి ఎం.రవిశంకర్ శర్మ అన్నారు. మండలంలోని బొల్లాపల్లి సెక్షన్ పరిధిలోని రావులాపురం, రేమిడిచర్ల, దొమలగుండం బీట్ పరిధిలో ఆడవుల్లో చేసిన పనులను ఆయన మంగళవారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో మార్చి వరకు సుమారు రూ.3 లక్షలతో ఆయా బీట్‌లలో నీటికుంటలు, సాసర్ పిట్స్, మొక్కలు పెంపకం, వంటి పనులు చేశారు. వీటిని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. నీటి కుంటల చుట్టూ మొక్కలు నాటడం, విత్తనాలు చల్లడం అటవీ ప్రదేశంలో పచ్చదనం కాపాడాలని సూచించారు. తనిఖీల్లో బొల్లాపల్లి డీఆర్వో వై.సూర్యనారాయణ, బీట్ అధికారులు డి.రామకృష్ణ, ఎన్.గణేష్ బాబు, వై.భాస్కర్ పాల్గొన్నారు.

### ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట: జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఆశ వర్కర్ల యూనియన్( సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలో ఆశ వర్కర్లతో ప్రదర్శన నిర్వహించి జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో డీఎండీహెచ్‌వో డాక్టర్ శోభారాణికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.శివకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### దాడి ఘటనపై కేసులు నమోదు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ రోడ్డులో ఆదివారం జరిగిన ఘర్షణలో ఇరు పార్టీలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ బాల నాగిరెడ్డి తెలిపారు. అమరావతి హోమ్స్‌లో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన పట్టణానికి చెందిన యర్రం రెడ్డి సీతమ్మ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరిపి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పార్టీ నాయకులు కడియాల రమేష్, చల్లా సుబ్బారావుతో పాటు మరికొంత మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బాధిత మహిళ యర్రంరెడ్డి సీతమ్మపై చదలవాడ అరవింద్ బాబుతోపాటు ఇతర టీడీపీ నేతలు పెద్దపెద్ద కర్రలతో దాడి చేసిన దృశ్యాలు లభ్యమవడంతో కేసులు నమోదు చేశారు. దీంతో పాటు మరో రెండు కేసులు టీడీపీ నాయకులపై నమోదయ్యాయి. అలాగే టీడీపీ కార్యకర్త మాతంగి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిలారు గోపితో పాటు మరికొంత మందిపై దాడి కేసు నమోదైంది.